## ఎక్కువ మంది పిల్లలున్నా పోటీకి అర్హులే

- బిల్లుకు ఏపీ అసెంబ్లీ ఆమోదం

హైదరాబాద్, నవంబర్ 14 (నమస్తేతెలంగాణ): ఆంధ్రప్రదేశ్‌లో ఇద్దరి కన్నా ఎక్కువ మంది పిల్లలున్న వారు స్థానిక సంస్థల ఎన్నికల్లో పోటీ చేసేందుకు ఇకపై అర్హులే.. దానికి సంబంధించిన నిబంధనకు సవరణ చేస్తూ అసెంబ్లీలో ప్రవేశ పెట్టిన బిల్లు ఆమోదం పొందింది. కుటుంబ నియంత్రణ చర్యల్లో భాగంగా 1994లో ఇద్దరి కన్నాఎక్కువ మంది సంతానం ఉన్న వారిని ఎన్నికల్లో పోటీ చేసేందుకు అనర్హులుగా గుర్తిస్తూ చట్టం చేశారు. ఇప్పుడు సంతానోత్పత్తి తగ్గడంతో ప్రభుత్వం ఈ నిర్ణయం తీసుకుంది.



## శ్రీవారికి రూ.2కోట్ల బంగారు కానుక

హైదరాబాద్, నవంబర్ 14 (నమస్తేతెలంగాణ): తిరుమల వేంకటేశ్వర స్వామికి ఓ భక్తురాలు రూ.2కోట్ల విలువైన బంగారు ఆభరణాన్ని కానుకగా సమర్పించారు. టీటీడీ మాజీ చైర్మన్ డీకే ఆదికేశవులనాయుడు మనుమరాలు చైతన్య శ్రీవారికి స్వర్ణ వైజయంతీమాలను టీటీడీ చైర్మన్ బీఆర్‌నాయుడు చేతుల మీదుగా సమర్పించారు. ఈ స్వర్ణమాలను ఉత్సవ మూర్తులకు అలంకరించనున్నట్టు టీటీడీ చైర్మన్ పేర్కొన్నారు. మరో స్వర్ణ వైజయంతీమాలను తిరుచానూరు పద్మావతీ అమ్మవారిని శుక్రవారం దర్శించుకుని దేవస్థానానికి అందించనున్నట్టు చైతన్య తెలిపారు.

# ఏసీబీకి చిక్కిన ఎస్సై, రైటర్

## స్టేషన్ బెయిల్ ఇచ్చేందుకు రూ.10 వేల లంచం డిమాండ్

లింగంపేట, నవంబర్ 14: స్టేషన్ బెయిల్ ఇవ్వడానికి రూ.10 వేల లంచం తీసుకుంటూ కామారెడ్డి జిల్లా లింగంపేట ఎస్సై అరుణ్‌తోపాటు పోలీస్ కానిస్టేబుల్ (రైటర్) రామస్వామి గురువారం ఏసీబీ అధికారులకు చిక్కారు. నిజామాబాద్ ఏసీబీ డీఎస్పీ శేఖర్‌గౌడ్ వివరాలు వెల్లడించారు. లింగంపేట మండలంలోని ఓ గ్రామానికి చెందిన వ్యక్తిపై గతంలో స్థానిక పోలీసుస్టేషన్‌లో కేసు నమోదైంది. ఈ కేసులో నిందితుడికి స్టేషన్ బెయిల్ ఇవ్వడానికి ఎస్సై డబ్బులు డిమాండ్ చేశాడు. లంచడం ఇవ్వడానికి ఇష్టపడని సదరు వ్యక్తి ఏసీబీ అధికారులను ఆశ్రయించాడు. ప్లాన్ ప్రకారం.. గురువారం మధ్యాహ్నం లంచం ఇచ్చేందుకు పోలీసుస్టేషన్‌కు వెళ్లాడు. ఎస్సై అరుణ్ సూచన మేరకు స్టేషన్ రైటర్ రామస్వామి రూ.10 వేలు లంచం తీసుకుంటుండగా ఏసీబీ అధికారులు రెడ్‌హ్యాండెడ్‌గా పట్టుకున్నారు. ఎస్సై, కానిస్టేబుల్‌ను హైదరాబాద్ నాంపల్లిలోని ఏసీబీ ప్రత్యేక కోర్టులో హాజరు పరచనున్నట్టు డీఎస్పీ తెలిపారు.




ఏసీబీకి చిక్కిన ఎస్సై అరుణ్, రైటర్ రామస్వామి

## నారాయణలో ఏఐ టూల్ 'ఆస్ట్రా' ఆవిష్కరణ

హైదరాబాద్, నవంబర్14 (నమస్తే తెలంగాణ): డిజిటల్ లెర్నింగ్‌ను మరింత సులభతరం చేయడానికి ఎన్‌లెర్న్ ప్లాట్‌ఫామ్‌ను మెరుగుపరచడం ద్వారా మరో అధునాతన ఏఐ టూల్ 'ఆస్ట్రా'ను విద్యార్థులకు అందుబాటులోకి తీసుకొచ్చినట్టు నారాయణ విద్యాసంస్థల అధినేత పునీత్ కొత్తప తెలిపారు. గురువారం విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ .. 'ఆస్ట్రా' అనేది ఏఐ ఆధారిత చాట్‌బాట్ అని పేర్కొన్నారు. ప్రశ్నలు అడిగిన కేవలం 30 సెకన్లలోపే తిరిగి సమాధానాలు అందిస్తుందని వెల్లడించారు. పాఠ్యాంశాల్లోని ప్రశ్నలతోపాటు సందేహాలను వేగంగా నివృత్తి చేస్తుందని తెలిపారు. విద్యార్థులు గతంలో అడిగిన ప్రశ్నలను మళ్లీ చూడవచ్చని, ఇతరులు సంధించిన ప్రశ్నలను సైతం 'ఆస్ట్రా'లో చూడవచ్చని పేర్కొన్నారు. ఏఐ ఆస్ట్రా టూల్ ఇప్పటికే 15000 మంది విద్యార్థులకు సేవలందించి 91% విద్యార్థులతో 5స్టార్ రేటింగ్ పొందిందని గుర్తుచేశారు. ఆస్ట్రా టూల్‌ను నారాయణ విద్యార్థులకు ఉచితంగా అందజేస్తున్నట్టు తెలిపారు. విద్యాభ్యాసాన్ని మెరుగుపరిచే వినూత్న సాధనాలతో విద్యార్థులను మరింత శక్తివంతం చేయడమే నారాయణ సంస్థల లక్ష్యమని ఆయన పేర్కొన్నారు. ఆస్ట్రా టూల్ నారాయణ సంస్థల నిబద్ధతకు నిదర్శనంగా నిలుస్తుందని తెలిపారు.

## బతుకమ్మకుంట పునరుద్ధరణకు హైడ్రా పనులు

హైదరాబాద్ సిటీబ్యూరో, నవంబర్ 14(నమస్తే తెలంగాణ): అంబర్‌పేట పరిధిలోని బతుకమ్మకుంటలో హైడ్రా పనులు కొనసాగుతున్నాయి. బుధవారం హైడ్రా కమిషనర్ రంగనాథ్ బతుకమ్మకుంటను సందర్శించగా.. అక్కడున్న చెత్త, పిచ్చిమొక్కలను తొలగించే పనులు చేపట్టారు. గురువారం కుంట ప్రాంతాన్ని చదునుచేశారు. చెరువులో నీరొచ్చే మార్గాలకు సంబంధించి స్థానికులు, ఇరిగేషన్, జీహెచ్‌ఎంసీ అధికారులతో కమిషనర్ రంగనాథ్ చర్చించారు. చెరువుకు సంబంధించిన పూర్తి ప్రణాళికను సిద్ధంచేసి బతుకమ్మకుంట సుందరీకరణ పనులు మొదలుపెడతామని పేర్కొన్నారు.

## స్కాలర్‌షిప్‌లను సత్వరమే చెల్లించాలి

- బీసీ యువజన సంఘం డిమాండ్

హైదరాబాద్, నవంబర్14 (నమస్తే తెలంగాణ): విద్యార్థుల స్కాలర్‌షిప్‌లను ప్రభుత్వం సత్వరమే చెల్లించాలని బీసీ యువజన సంఘం రాష్ట్ర అధ్యక్షుడు జిల్లాపల్లి అంజి డిమాండ్ చేశారు. తెలంగాణలో 10 నెలలుగా ప్రభుత్వం ఫీజు రీయింబర్స్‌మెంట్, స్కాలర్‌షిప్ బిల్లులను విడుదల చేయలేదని, అదే కాంట్రాక్టర్ల బిల్లులను మాత్రం విడుదల చేస్తున్నదని ధ్వజమెత్తారు. ఇప్పటికైనా వెంటనే స్కాలర్‌షిప్‌లను విడుదల చేయాలని డిమాండ్ చేశారు. లేదంటే రాష్ట్రవ్యాప్తంగా విద్యార్థులతో కలిసి ఉద్యమిస్తామని హెచ్చరించారు.














